dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ | సపుంటి: 01 | సంచిక: 02 | 06 గురువారం, ఆగస్టు 2026

## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై

# కేంద్రం జోక్యం చేసుకోవాలి

### కేంద్రమంత్రి సి.ఆర్. పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**న్యూఢిల్లీ డీసీ**

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 150 మీటర్లకు పెంచే విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఒప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు ఎంపీలతో కలిసి సీఎం పాల్గొని వినతిపత్రం సమర్పించారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిన విషయాన్ని గుర్తుచేసిన సీఎం, ఎత్తును 150 మీటర్లకు పెంచినా ముంపు ప్రాంతం 1,000 హెక్టార్లలోపే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రాజెక్టు ఎత్తు పెంపుతో ఎత్తిపోతల (లిఫ్ట్) భారం లేకుండా గ్రావిటీ ద్వారానే సజావుగా నీటిని అందించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, దేవులపల్లి (ఎస్ఆర్వీఆర్ డిండి), గౌరవెల్లి ప్రాజెక్టులతో పాటు పలు రహదారులకు సంబంధించిన శాఖాపరమైన అటవీ పర్యావరణ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన సీఎం



రేవంత్ రెడ్డి, ప్రధాని

మిగతా 2వ పేజిలో..

## హర్మూజ్ జలసంధి తెరిచే

# వరకు దాడి ముప్పు

### ఇరాన్‌కు డోనాల్డ్ ట్రంప్ ఘాటు హెచ్చరిక



**న్యూఢిల్లీ డీసీ**

హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. దౌత్యపరమైన చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని భావిస్తున్న సమయంలో, వాటిని ఇరాన్ బహిరంగంగా ఖండించడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈసారి గనుక చర్చల నుంచి వెనక్కి తగ్గితే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కనివినీ ఎరుగని రీతిలో అతిపెద్ద దాడిని ఎదుర్కోవాల్సి ఉంటుందని టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఇరాన్ వైఖరిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై రాబోయే 48 గంటల్లో స్పష్టత వస్తుందని, ఆ దేశం అణ్వాయుధాలు

మిగతా 2వ పేజిలో..

# దిగొచ్చిన మెటా

### ప్రధాని మోదీ వీడియో తొలగింపు వ్యవహారంలో మార్క్ జుకర్‌బర్గ్ బహిరంగ క్షమాపణలు

**న్యూఢిల్లీ డీసీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన ఒక వీడియోను తాత్కాలికంగా తొలగించడం మరియు నియంత్రించడంపై రేగిన దుమారంతో సోషల్ మీడియా దిగ్గజం మెటా దిగివచ్చింది. ఈ ఘటనపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు తెలిపారు. తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో పొరపాట్లు జరిగాయని అంగీకరించడమే కాకుండా, డీప్‌ఫేక్స్, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి డబ్బులు తీసుకున్నామనే విషయాన్ని కూడా మెటా ఒప్పుకుంది. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై జులై 23న ప్రధాని మోదీ మాట్లాడిన వీడియోను ఫేస్‌బుక్ పరిమితం చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడంతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారంలో



పార్లమెంటరీ కమిటీ మెటాకు మూడు రోజుల అల్టిమేటం జారీ చేస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను రద్దు చేసే అంశాన్ని

మిగతా 2వ పేజిలో..

# విశాఖలో 'ఐబీఎం ఫ్యూచర్‌నౌ'

### గ్లోబల్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావా లని మంత్రి లోకేశ్ పిలుపు

**విశాఖపట్నం డీసీ**

ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ యువత చురుగ్గా భాగస్వామ్యం కావాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ ఐటీ దిగ్గజం ఐబీఎం ఏర్పాటు చేసిన నూతన 'ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్'ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ సేవలు, సాంకేతిక ఆవిష్కరణలకు విశాఖపట్నాన్ని అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేవలం సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, నాణ్యమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రతిభావంతులైన మానవ వనరులను తీర్చిదిద్దడం మరియు ఏపీ యువత గ్లోబల్ డిజిటల్ ఎకానమీలో భాగమయ్యేలా సమగ్ర పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. గ్లోబల్ క్లయింట్లకు అధునాతన




ఏఐ, కన్సల్టింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా ఐబీఎం ఈ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను తీర్చిదిద్దింది. ఈ కేంద్రం ద్వారా ఆర్టిఫిషియల్

మిగతా 2వ పేజిలో..

# తెలంగాణలో అందుబాటులోకి 'డయల్ 112'

### పోలీసు, ఫైర్, అంబులెన్స్ సేవలు ఇక ఒక్కటే నంబర్‌పై!

**హైదరాబాద్ డీసీ**

అత్యవసర సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ తెలంగాణ ప్రభుత్వం 'డయల్ 112' సేవలను అధికారికంగా ప్రారంభించింది. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు, ఫైర్, అంబులెన్స్‌తో పాటు న్యాయ, వైద్య, సైబర్ సాయం వంటి 18 రకాల విభిన్న సేవలను ఈ ఒక్క నంబర్ ద్వారానే పొందవచ్చని

మిగతా 2వ పేజిలో..




## తమిళనాట టీవీకే

# ప్రభుత్వం తొలి బడ్జెట్

### విద్య, మహిళా సంక్షేమానికి పెద్దపీట

**చెన్నై డీసీ**

తమిళనాడు రాష్ట్రంలో సీఎంగా విజయ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన ప్రభుత్వం అసెంబ్లీలో బుధవారం తన తొలి బడ్జెట్‌ను సమర్పించింది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో

మిగతా 2వ పేజిలో..



## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

**మొదటిపేజీ తరువాయి..** మోదీని ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో తమ ప్రభుత్వం స్పందించి చట్టపరంగా కేసులు నమోదు చేసిందని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇటువంటి ఘటనలపై కనీసం ఒక్క కేసైనా నమోదు చేశారా అని ప్రశ్నించారు. ఒక డీఎస్పీ బదిలీ అంశంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలకు స్పందిస్తూ, అధికారుల బదిలీ అనేది ప్రభుత్వ ముందస్తు పరిధిలోని అధికారమని స్పష్టం చేశారు.

# తెలంగాణలో అందుబాటులోకి 'డయల్ 112'

**మొదటిపేజీ తరువాయి..** వెల్లడించారు. బాధితులు డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు ఏ నిమిషంలోనూ ఆ కాల్‌ను పోలీసులు తిరస్కరించడానికి వీల్లేదని, బాధితుల లొకేషన్‌ను తక్షణమే గుర్తించేందుకు అడ్వాన్స్డ్ అలర్టింగ్ సిస్టమ్‌ను ఉపయోగిస్తున్నామని స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు అంతస్తులను ప్రత్యేకంగా ఈ వ్యవస్థ పర్యవేక్షణ కోసం కేటాయించినట్లు తెలిపారు. సాంకేతికతను జోడించి ఈ సేవలను మరింత బలోపేతం చేసేందుకు డయల్ 112ను వర్షన్ 3.0గా రూపొందించామని డీజీపీ పేర్కొన్నారు. అత్యవసర స్పందన వ్యవస్థను మరింత వేగవంతం చేసేందుకు త్వరలోనే ప్రత్యేక డ్రోన్ ఆధారిత టీమ్‌ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఈ కొత్త విధానంలో కృత్రిమ మేధ సాంకేతికతను, యంగ్ ఐపీఎస్ అధికారుల నైపుణ్యాలను భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గతంలో సూచించిన "ఒకే అత్యవసర నంబర్" నిబంధనకు అనుగుణంగా, 2013లో ప్రారంభమైన డయల్ 100 స్థానంలో టెక్నాలజీ పోలీసింగ్‌ను మరింత ఆధునీకరించి ఈ డయల్ 112ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి పనులు పూర్తి: మూసారాంబాగ్ ప్రాజెక్టును తనిఖీ చేసిన మంత్రులు పొన్నం, అజారుద్దీన్

**హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయినట్లు హైదరాబాద్ ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి అజారుద్దీన్‌తో కలిసి ఆయన నూతనంగా నిర్మించిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల వ్యయంతో అందుబాటులోకి తెచ్చిన ఈ అత్యాధునిక స్టీల్ బ్రిడ్జి ద్వారా చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఒవైసీ ఆస్పత్రి వైపునకు, అలాగే చంపాపేట మార్గానికి రాకపోకలు మరింత సులువవుతాయని పేర్కొన్నారు. అతిత్వరలోనే ఈ వంతెనను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల నివాసితులకు దీర్ఘకాలిక ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి లభించడమే కాకుండా ప్రయాణ సమయం ఆదా కానుంది. ఇదే సమయంలో మూసారాంబాగ్ వద్ద చేపట్టిన వంతెన నిర్మాణం కూడా చివరి దశకు చేరుకుందని, రాకపోకలను సులభతరం చేసేందుకు అప్రోచ్ రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన ప్రాజెక్టులతో పాటు పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రజలకు వేగవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## ఎపిఎన్ఆర్టీ కోఆర్డనేటర్ల నియామకం

**అమరావతి :** ఏపీ ఎన్ఆర్టీ కోఆర్డినేటర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండో విడత జాబితాలో నియమించింది. రెండో విడతలో 292 మందిని కోఆర్డినేటర్లుగా నియమించింది. ప్రవాసాంధ్రుల అభ్యున్నతికి సంక్షేమం కోసం ఈ నియామకాలు చేపట్టినట్లు ఏపీ ఎన్ఆర్టీ ప్రకటించింది. భారత ఎంబసీలు, స్థానిక ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛంద సేవలు అందించేందుకు కోఆర్డినేటర్లు సహకరిస్తారని తెలిపింది. కొత్తగా కోఆర్డినేటర్లుగా నియమితులైన వారికి ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ ప్రెసిడెంట్ వేమూరి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

# హర్మూజ్ జలసంధి తెరిచే వరకు దాడి ముప్పు

**మొదటిపేజీ తరువాయి..** కలిగి ఉండటాన్ని అమెరికా ఎంతమాత్రం సహించదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకల పునరుద్ధరణకు సంబంధించి ఇరాన్ మరియు ఒమన్‌లతో తాము చర్చలు జరుపుతున్నామని, ఒకటి రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వెల్లడించారు. అయితే అమెరికా ప్రకటనను ఇరాన్ తక్షణమే తిరస్కరించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న సంప్రదింపుల్లో అమెరికా ప్రమేయం ఏమాత్రం లేదని, కేవలం తమ సార్వభౌమాధికారం మరియు భద్రతా ప్రయోజనాల పరిరక్షణ కోసమే కొత్త సముద్ర రవాణా విధానంపై చర్చిస్తున్నామని తెలిపింది. ఇరు దేశాల మధ్య పరస్పర ప్రతికూల వ్యాఖ్యలతో పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

# తమిళనాట టీవీకే ప్రభుత్వం తొలి బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి..** విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు విశేష ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యంగా ఎన్నికల హామీల్లో ప్రధానమైన 'అన్నన్ సీర్ తిట్టమ్' పథకానికి బడ్జెట్‌లో రూ.812 కోట్లు కేటాయించడం విశేషం. ఈ పథకం ద్వారా లబ్ధిదారులైన వధువులకు 8 గ్రాముల బంగారం మరియు పట్టుచీరను అందించనున్నారు. ఉపాధి, సాంకేతిక రంగాలకు సైతం పెద్దపీట వేస్తూ, 2031 నాటికి సుమారు ఐదు లక్షల మంది ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులు మరియు అధ్యాపకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అంతేకాకుండా, 'వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్' ద్వారా లక్షమంది యువతకు దశలవారీగా నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందుబాటులోకి తేనున్నారు.

విద్యా రంగానికి సంబంధించి కీలక ప్రకటనలు చేస్తూ, రూ.2వేల కోట్ల అంచనాతో విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసేందుకు 'వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్'ను ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించేందుకు రూ.300 కోట్లు కేటాయించగా, 'పుతియా పయనం-పుతియా వేగం' కింద 11వ తరగతి చదువుతున్న 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లతో పాటు హెల్మెట్లు, వాటర్ బాటిళ్లను కూడా అందజేయనున్నారు. కాగా, కుటుంబ పెద్దగా ఉన్న మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, ఏటా 6 ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, మరియు మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి ఇతర హామీలకు సంబంధించి ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటనలు వెలువడలేదు.

## విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

**బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం**

**బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. 2024-25 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో విద్యారంగానికి కేవలం 5.98 శాతం మాత్రమే కేటాయించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. గత 6-7

ఏళ్ల తెలంగాణ బడ్జెట్‌లను పరిశీలిస్తే విద్యారంగానికి ఇంత తక్కువ శాతం నిధులు కేటాయించడం ఇదే తొలిసారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజ్ఞాన గనిగా మారాల్సిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే ఉంచుకున్నప్పటికీ, ఆ శాఖకు తగిన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తారని భావిస్తే, బ్జడెట్‌లో కేవలం 5.98 శాతానికే పరిమితం చేయడం దురదృష్టకరమని అన్నారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యా లయాలు మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ సమాజం విద్యావంతం కావడం, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే విద్యారంగానికి కేటాయింపు లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# దిగొచ్చిన మెటా

**మొదటిపేజీ తరువాయి** పరిశీలిస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌లతో న్యూఢిల్లీలో సుదీర్ఘంగా సమావేశమైంది. ప్రముఖుల ఖాతాల్లోని పోస్టుల తొలగింపు, అల్గోరిథం పనితీరు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తప్పుడు సమాచార నియంత్రణ మరియు భారత చట్టాలకు లోబడి పనిచేయడంపై కేంద్రం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దేశ భద్రత, ప్రజా శాంతి విషయాల్లో సోషల్ మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందేనని కేంద్రం తేల్చిచెప్పింది.

## విశాఖలో 'ఐబీఎం ఫ్యూచర్‌నౌ'

**మొదటిపేజీ తరువాయి..** ఇంటెలిజెన్స్, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాలలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. అంతేకాకుండా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫారమ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్ మరియు క్వాలిటీ ఇంజనీరింగ్ సేవలకు ఇది ప్రధాన హబ్‌గా వ్యవహరించనుంది. విశాఖను దేశంలోనే ప్రముఖ ఏఐ మరియు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రంగా మార్చే క్రమంలో ఐబీఎంతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి లోకేశ్ తెలిపారు.

## క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలో వర్షాలు: 18 జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

**హైదరాబాద్**

రాష్ట్రంలో ఏర్పడిన క్యుములోనింబస్ మేఘాల ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో వర్ష సూచన ఉందని పేర్కొంటూ వివిధ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అదేవిధంగా హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, నారాయణపేట, వరంగల్ సహా 18 జిల్లాలకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

గడిచిన 24 గంటల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గణనీయమైన వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా పిట్లంలో 14.11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం మీద 4 మండలాల్లో 11.56 సెం.మీ నుంచి 20.44 సెం.మీ మధ్య అత్యంత భారీ వర్షపాతం నమోదు కాగా, 40 మండలాల్లో 6.45 సెం.మీ నుంచి 11.55 సెం.మీ మధ్య మోస్తరు వర్షపాతం, అలాగే 281 మండలాల్లో 1.56 సెం.మీ నుంచి 6.44 సెం.మీ వరకు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## ఎపికి విదేశీ పెట్టుబడుల వెల్లువ

**లోక్‌సభలో వైసిపి సభ్యుడి ప్రశ్నకు కేంద్రం సమాధానం**

**న్యూఢిల్లీ** ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేందప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024-25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది. 2025 - 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025 - 26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్అండ్‌డీ పరిధిలోనూ 2025-26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పెట్టుబడులు ఊపందుకున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రీసౌండింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొంది. లోహ, ఆహార శుద్ధి, సిమెంట్ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని కేంద్రం ప్రభుత్వం స్పష్టం

dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ | సపుంటి: 01 | సంచిక: 02 | 06 గురువారం, ఆగస్టు 2026

## కరీంనగర్‌లో '10 కోట్ల వ్యసన ముక్త మెగా క్యాంపెయిన్' ప్రారంభం

**వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

**అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**




**కరీంనగర్ డీసీ :**
ప్రజాపిత బ్రహ్మా కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, మౌంట్ అబూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన "10 కోట్ల వ్యసన ముక్త మెగా క్యాంపెయిన్" బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వ్యసనాల బారిన పడకుండా యువతతో పాటు సమాజంలోని అన్ని వర్గాల్లో అవగాహన కల్పించడం, దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించడమే ఈ మహా అభియాన్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. మత్తు పదార్థాలు వ్యక్తి ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా దెబ్బతీస్తాయన్నారు. వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత మంచి అలవాట్లను పెంపొందించుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వామి, డీడబ్ల్యూఓ సరస్వతి ఆర్డీవోలు షర్మిల జల కుమారి తహసీల్దార్లు (ఎంఆర్వోలు), వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాపిత బ్రహ్మా కుమారీస్ ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొని వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు.

## హాస్పిటల్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

**పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ డీసీ :**



జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, ఎలాంటి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం- 2010 కింద ఏర్పాటైన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ జిల్లా స్థాయి సమావేశం బుధవారం రాత్రి కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల వివరాలు, వివిధ శాఖల నుంచి రావాల్సిన ఎన్వోసీల స్థితిగతులపై అధికారులను ఆరా తీశారు. ఆలస్యానికి తావు లేకుండా పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని దరఖాస్తులను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రైవేట్‌గా ఆరోగ్య సేవలు అందించే ప్రతి ఆసుపత్రి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రతి ఐదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఏ ప్రైవేట్ ఆసుపత్రి కూడా వైద్య సేవలు అందించరాదన్నారు.
ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాజగోపాలరావు, డెమో శ్రీనివాస్, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షురాలు డా. ఆకుల శైలజ, ప్రధాన కార్యదర్శి డా. మహేష్‌తో పాటు పోలీసు, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 7 వరకు ఓపెన్ వర్సిటీ డిగ్రీ, పీజీ, ఎంబీఏ ప్రవేశాలకు గడువు

**కరీంనగర్ డీసీ**
డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ, ఎంబీఏ కోర్సుల్లో దూరవిద్య (ఙఱర్ఖుఅషవ జుఽబష్ఠ్ఱశీఅ) ద్వారా ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కరీంనగర్ ఎస్సారార్ కళాశాల ప్రాంతీయ సమన్వయ కేంద్రం కోఆర్డినేటర్ సత్యప్రకాష్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి, దరఖాస్తు ఫారాలను సంబంధిత అధ్యయన కేంద్రాలలో సమర్పించాలని సూచించారు. కోర్సుల వివరాలు, ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం అధ్యయన కేంద్రాన్ని గానీ లేదా విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ www.braou.ac.in ను గానీ పరిశీలించవచ్చని పేర్కొన్నారు.

## వేములవాడ - కరీంనగర్ రహదారిపై కూలిన మర్రిచెట్టు

- కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు
- ప్రాణనష్టం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న జనం



**వేములవాడ :**
వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని నాంపల్లి సమీపంలో బుధవారం భారీ ప్రమాదం తప్పింది. వేములవాడ - కరీంనగర్ ప్రధాన రహదారిపై ఉన్న ఓ పెద్ద మర్రి వృక్షం ఒక్కసారిగా నేలకూలింది. దీంతో ఈ మార్గంలో దాదాపు మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కరీంనగర్--సిరిసిల్ల--వేములవాడ మధ్య ప్రయాణించే వందలాది వాహనాలు రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో పోకలు బంద్ కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర పనులపై వెళ్లే ప్రయాణికులు నడిరోడ్డుపై తీవ్ర అవస్థలు పడ్డారు.

### జేసీబీలతో చెట్టు తొలగింపు

రహదారిపై చెట్టు కూలిన సమాచారం తెలియగానే పోలీసులు, ఇతర శాఖల అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీ యంత్రాల సాయంతో భారీ కొమ్మలను నరికివేసి రహదారిపై నుంచి తొలగించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అత్యంత రద్దీగా ఉండే సమయంలో భారీ వృక్షం కూలినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఆచంపల్లి పాఠశాలలో 'ఏఐ' శిక్షణ

- 'అన్న, అక్క' మెంటార్‌షిప్ ప్రోగ్రామ్ షురూ
- 15 రోజుల పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన



**గంగాధర డీసీ :**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అన్న, అక్క' మెంటార్‌షిప్ కార్యక్రమంలో భాగంగా ఆచంపల్లి గ్రామ ఉన్నత ప్రాథమిక పాఠశాల (యూపీఎస్) లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు 15 రోజుల పాటు అందించే ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ ఆరే తేజశ్రీ రాజశేఖర్ లాంఛనంగా ప్రారంభించారు.

### విద్యార్థులకు డిజిటల్ మెలకువలు

ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మెంటార్లుగా వ్యవహరిస్తూ, పాఠశాల విద్యార్థులకు ఏఐ డిజిటల్ క్లాసులు నిర్వహించనున్నారు. సాంకేతిక రంగానికి సంబంధించిన పలు అంశాలు, రోజువారి వినియోగంలో ఏఐ ప్రాధాన్యత మెలకువలను చిన్న పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా నేర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్కుల అనూష శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, పాలకవర్గ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వెలిచాల చెరువు నుంచి నీటి విడుదల

**పంట పొలాలకు నీరందించి రైతులకు**

**ఊరటనిచ్చిన సర్పంచ్ వీర్ల నర్సింగరావు**

**రామడుగు డీసీ**



వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్న పంట పొలాలను కాపాడేందుకు వెలిచాల గ్రామ చెరువు నుంచి సాగునీటిని బుధవారం అధికారికంగా విడుదల చేశారు. కొన్ని వారాలుగా సరైన వర్షాలు లేకపోవడంతో వరి తదితర పంటలు ఎండిపోతున్నాయని గ్రామానికి చెందిన రైతులు సర్పంచ్ వీర్ల నర్సింగరావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యపై తక్షణమే స్పందించిన సర్పంచ్, పాలకవర్గ సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించి చెరువులోని నీటి మట్టాన్ని పరిశీలించారు. నీటి విడుదల పట్ల స్థానిక రైతులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దిగారి ఎల్లయ్య, స్థానిక నాయకులు తోడేటి శ్రీనివాస్, బండపెల్లి శ్రీనివాస్, రొడ్డ రాజయ్య, కాడే నర్సింగంతో పాటు వివిధ వార్డుల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఎగువ మానేరు వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి గితె
- ప్రాజెక్టు సామర్థ్యం 2 టీఎంసీలు.. ప్రస్తుత నీటి నిల్వ 1.6 టీఎంసీలు



**గంభీరావుపేట డీసీ :**
ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. బుధవారం గంభీరావుపేట మండల పరిధిలోని నర్మాలలో గల ఎగువ మానేరు ప్రాజెక్టును జిల్లా ఎస్పీ మహేష్ బి గితె, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం, ఎగువ నుంచి వస్తున్న వరద తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కూడవెల్లి, పాల్వంచ వాగుల నుంచి ఇన్ ఫ్లో ఏమీ లేదని నీటి పారుదల శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.6 టీఎంసీల నీటి నిల్వ ఉందని వివరించారు.

### రాకపోకల నియంత్రణకు బారికేడ్లు

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉన్నందున అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నీటి మట్టాన్ని గమనిస్తూ ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల ప్రజలకు, రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ఒకవేళ ప్రాజెక్ట్ మత్తడి పారితే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు దయాకర్, ప్రశాంత్, తహసీల్దార్ మారుతీ రెడ్డి, సర్పంచ్ అర్చన ఆంజనేయులు పాల్గొన్నారు.

## రూ. 17.09 లక్షల విలువైన గంజాయి దహనం

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ వెల్లడి
- పర్యావరణ నిబంధనల ప్రకారం ఇన్‌సినిరేటర్‌లో ధ్వంసం



**గోదావరిఖని డీసీ :**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు అత్యంత కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ) అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 81 ఎన్‌డీపీఎస్ (చీఖూూ) కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ. 17.09 లక్షల విలువైన గంజాయిని న్యాయస్థానం అనుమతితో ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. న్యాయాధికారుల సమక్షంలో కేసుకు సంబంధించిన ప్రాపర్టీ నుంచి ఫోరెన్సిక్ పరీక్షల కోసం ముందుగా నమూనాలు (శాంపిల్స్) సేకరించారు. అనంతరం కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటిస్తూ, కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలోని ఇన్‌సినిరేటర్‌లో 40.173 కిలోల ఎండు గంజాయి, 26 గంజాయి మొక్కలను దహనం చేసినట్లు సీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జైపూర్ ఏసీపీ ఎ. వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఎస్ఐ వినీత పాల్గొన్నారు.

డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER



# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల




యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న డోరతి మూవీ




న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

# ఆదిపురుష్‌తో రామాయణను పోల్చవద్దు

**రామాయణ విజయం సాధించాలన్న మనోజ్**




బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై మాట్లాడారు. 'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన యశ్‌పై ప్రశంసలు కురిపించారు. యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి
తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని మనోజ్ తెలిపారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటికే రెండో భాగం కూడా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్‌బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# ఫౌజీ కోసం భారీ చార్మినార్ సెట్

**నిరంతరాయంగా షూటింగ్ కోసం ప్లాన్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి-లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొంది స్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

# మిస్సింగ్ మేఘన ..ఫస్ట్ లుక్ విడుదల

రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధృవన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వి.వి. వినాయక్ గారిది గో÷-డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శామ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, వనరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.

# విడుదలకు సిద్ధం అవుతున్న కొరియన్ కనకరాజు




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో-కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్.ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో
ఆకట్టుకున్నారని సమాచారం.
సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది.కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.